కలగానే డబుల్ రోడ్డు!


అధ్వానంగా మారిన రావిర్యాల సర్దార్‌నగర్ రోడ్డు

- విస్తరణకు నోచుకోని రావిర్యాల - సర్దార్‌నగర్ రహదారి
- సింగల్ రూట్‌తో వాహనదారులు, ప్రజల అవస్థలు
- అధికారులు, పాలకులు స్పందించాలని వినతి

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల - సర్దార్‌నగర్ రోడ్డు విస్తరణ కలగానే మారింది. దీన్ని డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయాలని ప్రజలు చాన్నాళ్లుగా డిమాండ్ చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. కొన్నేళ్లుగా ఈ రహదారికి మరమ్మతులు చేయకపోవడంతో పూర్తిగా గుంతలమయమైంది. అసలే సింగల్ రోడ్డు అందులోనూ గోతులు ఉండటంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణించేందుకు జంకుతున్నారు. నిత్యం తుక్కుగూడ, సర్దార్ నగర్ నుంచి రావిర్యాలకు వాహనదారులు, రైతులు ఇలా వందలాంది మంది రాకపోకలు సాగిస్తుంటారు. దీనికి తోడు ఇదే రూట్లో సూర్యగిరి ఎల్లమ్మ ఆలయం ఉండటంతో భక్తుల తాకిడి కూడా అధికంగా ఉంటుందని. ముఖ్యంగా మంగళవారం రోజున వందల సంఖ్యలో వస్తుంటారు. ఈ సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు వర్షాకాలంలో రావిర్యాల పెద్ద చెరువు నీరు రోడ్డు వస్తుండటంతో తీవ్ర అంతరాయం కలుగుతోందని చెబుతున్నారు.

శిథిలావస్థలో బ్రిడ్జ్

ఈ రహదారిలో పులిందర్ వాగుపై ఉన్న బ్రిడ్జ్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. గత వర్షాకాలంలో వరద నీరు వంతెన పైనుంచి రావడంతో కొన్ని నెలల పాటు వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిపేశారు. అధికారులు స్పందించి సింగల్ రోడ్డును డబల్ రోడ్డుగా మార్చడంతో పాటు, పులిందర్ వాగుపై కొత్త బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విన్నవిస్తున్నారు.

క్లుప్తంగా

శాంతిభద్రతలను పరిరక్షించాలి


కేఎల్లార్‌ను కలిసిన బాలాపూర్ సీఐ భూపతి

పహాడీషరీఫ్: నేరాలను తగ్గిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు కృషి చేయాలని కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. బాలాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ టి.భూపతి శనివారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా పాలన కొనసాగిస్తున్నారన్నారు. రాష్ట్రం ప్రగతి పథంలో ముందుకు సాగాలంటే శాంతిభద్రతలు ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ విషయంలో పోలీసు అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

మున్సిపల్ సిబ్బందికి సామగ్రి అందజేత


సిబ్బందికి సామగ్రి అందజేస్తున్న అధికారులు

తుక్కుగూడ: మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుద్ధ్య, ఇతర కార్మికుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తామని కమిషనర్ బి.వెంకట్రామ్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందికి శానిటేషన్ పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు చేసే సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతినెలా పరికరాలు అందజేస్తున్నామని తెలిపారు. మేనేజర్ వెంకటేశం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపన్యాస పోటీలు

మీర్‌పేట: మీర్‌పేటలోని నారాయణ ఐఐటీ ఒలింపియాడ్ పాఠశాలలో శనివారం ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం రవీందర్‌లు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించేలా శిక్షణ ఇస్తున్నామన్నారు. అందులో భాగంగానే మంచి వక్తలుగా మారాలన్న ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహించామన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. పాఠశాల హెడ్స్ శివరంజని, మహేశ్వరి, మీనా, కో ఆర్డినేటర్‌లు మనోహర్, వాణి, స్వప్న, పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణం


కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీచీకటి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ధర్మకర్తలు మొకరాల లక్ష్మణ్‌శర్మ, రాజశేఖర్‌శర్మ, భాస్కర్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. శనివారం శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణం జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, వికారాబాద్ జెడ్పీచైర్‌పర్సన్ సునీతారెడ్డి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, ఎస్ మల్లేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు ఎస్ కృష్ణనాయక్, పాండురంగారెడ్డి, మల్లయ్య, దామోదర్‌గౌడ్, పాండుగౌడ్, రవీందర్, మాజీ సర్పంచులు అంజయ్యగౌడ్, దేవిపాండుగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నూతన ఆలోచనలకు పదును పెట్టాలి'

మొయినాబాద్: సాంకేతిక రంగ విద్యార్థులు నూతన ఆలోచనలకు పదును పెట్టి సమాజాభివృద్ధికి తోడ్పడాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మాజీ డైరెక్టర్ హెచ్‌పీ సింగ్ పేర్కొన్నారు. చిలుకూరు రెవెన్యూలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ పరిశోధన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అవరోధాలను గుర్తించి వాటికి నిర్మాణాత్మకమైన పరిష్కారాలను చూపించాలన్నారు. న్యూఢిల్లీ పంచాయతీరాజ్ శాఖ కన్సల్టెంట్ ఎండీ ఖాన్, కళాశాల డైరెక్టర్ రోహిత్ కందకట్ల, ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణరెడ్డి, కన్వీనర్ ఎల్‌జే హరి, ఏఓ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ గురుకులంలో వైద్య శిబిరం


ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న ఎంపీపీ తదితరులు

కందుకూరు: బైరాగిగూడ బీసీ వెల్ఫేర్ గురుకులంలో శనివారం ఎంపీపీ మంద జ్యోతిపాండు ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు, చికిత్సలు చేయించారు. మండల వైద్యాధికారిణి డాక్టర్ రేవతి బృందం సభ్యులు విద్యార్థులను పరీక్షించి మందులు పంపిణీ చేసింది. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగభూషణాచారి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


బీసీ గురుకులంలో విద్యార్థులకు చికిత్సలు చేసి మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

సమస్యల పరిష్కారానికి వినతి


ఆర్డీఓకు వినతి పత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు, మధ్యాహ్న భోజన కార్మికులు.

- ఆర్డీఓకు వినతిపత్రం అందజేసిన మధ్యాహ్న భోజన కార్మికులు
- 28న చలో కలెక్టరేట్ నిర్వహిస్తామని వెల్లడి

కందుకూరు: తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజు మాట్లాడుతూ.. నాలుగైదు నెలలుగా మధ్యాహ్న భోజన కార్మికులకు జీతాలు అందడంలేదన్నారు. దీంతో వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి విద్యార్థులకు భోజనం వండించాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించేలా సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 28న కలెక్టరేట్ ముట్టడి చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఆర్డీఓను కలిసిన వారిలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు కల్యాణ్, శ్రీనివాస్, లావణ్య, శోభ, అండాలు, లక్ష్మమ్మ ఉన్నారు.

ఎస్‌డీఎఫ్ నిధులను వెంటనే విడుదల చేయాలి

ఎమ్మెల్యే సబితారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు గత ప్ర భుత్వం మంజూరు చేసిన ఎస్‌డీఎఫ్ (స్పెషల్ డెవలప్ ఫండ్) నిధులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కోరారు. శనివారం మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్ అధ్యక్షతన మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో మీర్‌పేట కార్పొరేషన్‌లో అభివృద్ధి పనుల నిమిత్తం జనరల్ ఫండ్‌తో పాటు ప్రభుత్వం నుంచి ఎస్‌డీఎఫ్ ద్వారా మొత్తం రూ.122 కోట్ల నిధులను తెచ్చామన్నారు. ఎస్‌డీఎఫ్ నుంచి తీసుకొచ్చిన రూ.50 కోట్ల నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని.. ప్రజా ప్రభుత్వమని చెప్పుకుంటున్న ప్రభుత్వం ప్రజల కోసం మంజూరు చేసిన నిధులను ఎలా నిలిపివేస్తారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ప్రజా అవసరాల దృష్ట్యా మీర్‌పేట కార్పొరేషన్‌కు రూ.50 కోట్లు, బడంగ్‌పేటకు రూ.50 కోట్లు, జల్‌పల్లి మున్సిపాలిటీకి రూ.20 కోట్లు, తుక్కుగూడకు రూ.25 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులను వెంటనే అప్పగించేలా ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మీర్‌పేట కార్పొరేషన్‌లోని మూడు చెరువుల్లో చందన చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయగా, మంత్రాల చెరువు, పెద్దచెరువు సుందరీకరణ పనులు మిగిలి ఉన్నాయని, పెద్దచెరువు చుట్టూ మెష్ వేసేందుకు రూ.కోటి, క్రీడా ప్రాంగణంలో యువతీ, యువకులకు వేర్వేరుగా క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ తదితర క్రీడల కోర్టులను నిర్మించేందుకు మరో రూ.1.20 కోట్లు మంజూరు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తీసుకున్న పనులు వీలైనంత త్వరగా పూర్తి చేసేలా సహకరించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ బి.చంద్రశేఖర్, ఎస్ఈ ఆంజనేయులు, డీఈ గోపీనాథ్, టీపీఓ దేవానంద్, ఏఈ శ్రీనివాసులు, మేనేజర్ వెంకట్‌రెడ్డి, ఆర్ఓ అంజన్‌రెడ్డి, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు

చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్


కాంగ్రెస్‌లో చేరిన ఆలాన్‌ఖాన్‌గూడ మాజీ సర్పంచ్‌లు

శంకర్‌పల్లి: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు తథ్యమని, ప్రతీ కార్యకర్తలు కృషి చేయాలని పామెన భీంభరత్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఆలాన్‌ఖాన్‌గూడ మాజీ సర్పంచ్‌లు సౌమ్యవెంకటేశ్, అనంత్‌రెడ్డిలు తన అనుచరులతో పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా భీంభరత్ మాట్లాడుతూ గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. శంకర్‌పల్లి మాజీ సర్పంచ్ శ్రీధర్, సింగాపురం, మాజీ ఎంపీటీసీ రాంచందర్, శ్రీశైలం, బుచ్చిరెడ్డి, జైపాల్, కృష్ణ, రఘు, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్క నాటుతున్న ఎఫ్ఏఎస్, బాలవికాస్ ప్రతినిధులు

శంకర్‌పల్లి: మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని మాజీ సర్పంచ్ గోపాల్ పేర్కొన్నారు. బాల వికాస్ ఆధ్వర్యంలో ఎఫ్ఏఎస్ సహకారంతో గ్రామంలోని శివాలయం, మారయ్య దేవాలయ ప్రాంగణంలో పండ్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు మానవాళికి ప్రాణ వాయువును అందిస్తుందన్నారు. ప్రతిఒక్కరూ తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సత్యనారాయణ గౌడ్, ఎఫ్ఏఎస్ ప్రతినిధులు శశి, చక్రి, నందిని, బాల వికాస్ ప్రతినిధులు విక్రం, రెహమాన్, రాజ్‌కుమార్, గ్రామ కార్యదర్శి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు కలుషితం

ఇబ్బందుల్లో జనం

- పట్టించుకోని అధికారులు


వృథాగా పోతున్న నీరు

షాబాద్: మండల కేంద్రంలోని జ్యోతిరావుఫూలే విగ్రహం పక్కనే ఉన్న ముంబాయి-బెంగళూరు హైవే రోడ్డు బ్రిడ్జి కింద మిషన్ భగీరథ పైపులైన్ పలిగిపోయాయి. దీంతో ఇక్కడ వరదలా మారి, కుంటను తలపిస్తుంది. దీంతో ఇక్కడి నుంచి పైప్‌లైన్లో కలుషితం అవుతుందని ప్రజలు వాపోతున్నారు. అక్కడ పైప్‌లైన్లు పగలడంతో మురుగుగా మారి మంచి నీరు కలుషితం అవుతుందని చెబుతున్నారు. ఈ నీటిని తాగడంతో రోగాల బారిన పడుతున్నట్లు చెబుతున్నారు. సంవత్సరాలు గడుస్తున్నా ఈ విషయాన్ని అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, జనం పడుతున్న ఇబ్బందిని పరిష్కరించాలని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి పైప్‌లైన్ లీకేజీని మరమ్మతులు చేయించి స్వచ్ఛమైన నీటి సరఫరా కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆకట్టుకున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

వనస్థలిపురం: విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో ఉన్న మేధాసంపత్తిని, సృజనాత్మకతను వెలికితీస్తాయని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.నిశాంత్‌జైన్ అన్నారు. శనివారం వనస్థలిపురంలోని రవీంద్ర భారతి పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పోకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన చంద్రయాన్-3, కరోనా వారియర్స్, హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ ప్లాంట్, డయాలసిస్, గుండె పని విధానం తదితర అంశాల నమూనాలను పరిశీలించి వారిని అభినందించారు. కార్యక్రమంలో ఇందిరా అవార్డు గ్రహీత, ఫిజిక్స్ ప్రొఫెసర్ సీపీ వర్ధని, పాఠశాల ప్రిన్సిపాల్ వరలక్ష్మి, డీన్ శ్రీదేవి, డీఏ దయాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణోత్సవం

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్‌లోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ధర్మాధికారి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో శనివారం శివ పార్వతి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో ఆర్‌కే పురం డివిజన్ మాజీ కార్పొరేటర్ దేప సురేఖ భాస్కర్ రెడ్డి, హరి హర శర్మ, శివ, శ్రీధర్, ఆనంద్, కాలనీవాసులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణ అందరి బాధ్యత

చేవెళ్ల: బాలల పరిరక్షణ అందరి బాధ్యత అని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ శోభారాణి పేర్కొన్నారు. కేజీబీవీ పాఠశాలలో శనివారం బాలల హక్కులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకుంటేనే వారి కుటుంబం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రభుత్వం బాలికల రక్షణకోసం అనేక చట్టాలను తీసుకొచ్చిందన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మికుల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలు ఎక్కువగా చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారని, మత్తు మందులు సేవించటం వల్ల వారి జీవితాలను నాశనం చేసుకంటున్నారని చెప్పారు. అలాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. చిన్నప్పటినుంచే లింగవివక్షత లేకుండా పెంచాలన్నారు. మహిళా సాధికారత సాధించాలంటే మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని చెప్పారు. ఏమైనా సమస్యలు ఎదుర్కొంటుంటే హెల్ప్‌లైన్ నెంబర్ 1098కు ఫోన్‌చేసి సమాచారం చేరవేయాలన్నారు. సూపర్‌వైజర్ శ్రీలక్ష్మీ, కేజీబీవీ ఇన్‌చార్జి శ్వేత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడిపూజ


చేవెళ్ల: పడిపూజలో పాల్గొన్న శివస్వాములు

చేవెళ్ల: మండలంలోని తంగడపల్లి గ్రామంలో శనివారం సురేశ్ గురుస్వామి ఆధ్వర్యంలో మహా పడిపూజ నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి పడిపూజ చేశారు. శబరీష భజన మండలి జంగిరెడ్డి భక్తి గీతాలు పాడారు. ఈ పడిపూజలో వచ్చిన స్వాములకు, భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సత్తయ్యగౌడ్, రాములుగౌడ్, చంద్రయ్యగౌడ్, గోపాల్‌రెడ్డి, జనార్దన్‌గౌడ్, గురుస్వాములు వీరభద్ర, గుండాల రాములు, స్వాములు విష్ణువర్ధన్‌రెడ్డి, నవీన్‌గౌడ్, శేఖర్, పరమేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వర ఆలయంలో..

మొయినాబాద్ రూరల్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా సంగమేశ్వర దేవాలయ ప్రాంగణం శివ నామస్మరణతో మారుమోగింది. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు స్వామి వారికి అభిషేకాలు, దివ్య రథోత్సవం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమాలు నిర్వహించిన అనంతరం గర్భ గుడిలో శివలింగానికి పూజలు, మహా మంగళహారతి, నైవేద్యం సమర్పించారు.

కొందుర్గు: మండల కేంద్రం శనివారం శివనామస్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా గురుస్వామి భూపాలచారి ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాలచారి మాట్లాడుతూ శివస్వాములు భక్తిశ్రద్ధలతో దీక్షలు చేస్తే ముక్తి లభిస్తుందన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి సత్యనారాయణ, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

యుద్ధ విద్యలో రాణించాలి

మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్


బెల్టులు అందుకున్న విద్యార్థులతో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: విద్యార్థులు యుద్ధ విద్యల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలో పరిగి రోడ్డులోని యూనిక్ పాఠశాలలో న్యూ పవర్ కుంగ్‌ఫూ అకాడమీ ఆధ్వర్యంలో కరాటే, కుంగ్‌ఫూ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన వారికి బహుమతుల ప్రదానం చేశారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ చదువుతో పాటు యుద్ధ విద్యలు నేర్చుకోవడం అభినందించదగ్గ విషయమన్నారు. ఇవి ఆపద సమయంలో శత్రువుల నుంచి తమను తాము రక్షించుకునేందుకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. యుద్ధ విద్యలతో శరీరం ధృడంగా తయారవుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువుతో పాటుగా, ఆట పాటల్లో ఆసక్తి కలిగించి ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ మాస్టర్లు బాల్‌రాజ్, అహ్మద్‌ఖాన్, ట్రాఫిక్ ఎస్ఐ రవీందర్ నాయక్, పాఠశాల ప్రిన్సిపాల్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లు రవికి నాగర్‌కర్నూల్ టికెట్ ఇవ్వాలి

కాంగ్రెస్ నాయకుడు జంగయ్య


విలేకరులతో మాట్లాడుతున్న జంగయ్య

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మల్లురవిని ప్రకటించాలని జిల్లా గ్రంథాలయ సంస్థల మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండి పార్టీ కోసం అహర్నిశలు పని చేస్తున్న మల్లురవికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పదవి ఉన్నా లేకున్నా ప్రజల కోసం పనిచేస్తూ నియోజకవర్గానికి పెద్ద దిక్కుగా మల్లురవి పని చేశారని అన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీగా మల్లురవి రెండు పర్యాయాలు పనిచేశారని గుర్తు చేశారు. మల్లురవి సేవలను సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించాలన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ కేశవులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు రాములు, మల్లయ్య, యాదయ్య, రాఘవేందర్, రవీందర్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.